క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరి

గుత్తి: పట్టణంలోని ఈద్గా, కమాటం వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సూపర్ వైజర్ నాగేశ్వరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాల్లోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గౌసియా, హుస్సేన్బీ పాల్గొన్నారు.

ఘనంగా సాగు బడి



పూజ చేస్తున్న అర్చకులు

శింగనమల: శింగనమల రంగరాయులు చెరువు కింద రైతులు బుధవారం సాగుబడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దేవాలయాల్లో పూజలు నిర్వహించి, చెరువు వద్ద సాగుబడి కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు బాగా కురిసి, చెరువు నిండాలని కోరుకున్నారు. చెరువు కింద పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రైతులు కాలువల్లో పూడిక తీత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆయుకట్టు రైతులు పాల్గొన్నారు.

11 నుంచి భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ ఉత్సవాలు

తాడిపత్రి అర్బన్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తాడిపత్రి శాఖ సభ్యులు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని నంద్యాల రోడ్డులోని ఎస్ఎల్ఎన్ వరహాలు గార్డెన్స్‌లో 18వ తేదీ వరకూ ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 11న గురువారం సాయంత్రం అహోబిల రామానుజ జీయర్ స్వామిచే భాగవత మహత్యం ప్రవచనంతో ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. 12న విష్వక్సేన ఇష్టి, 13న, లక్ష్మీనారాయణ ఇష్టి, 14న, హయగ్రీవ ఇష్టి, 15, ధన్వంతరి ఇష్టి, 16న భూవరాహ ఇష్టి, 17న సుదర్శన ఇష్టి, 18న నారసింహ ఇష్టి ఉంటుందన్నారు. అదే రోజు సాయంత్రం రుక్మిణీ కల్యాణంతో ఉత్సవాలు ముగియనున్నట్లు వికాస తరంగిణి తాడిపత్రి శాఖ సభ్యులు తెలిపారు.


ఎన్నికల హామీలు నెరవేరుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

యాడికి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి అన్నారు. బుధవారం యాడికి మండల కేంద్రంలో పర్యటించిన ఎమ్మెల్యేకు ఆ పార్టీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు స్వాగతం పలికారు. స్థానిక శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. ఆలయం ముంగిట ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వారంలో ఒక రోజు యాడికి మండల కేంద్రంలో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

పామిడి: పామిడిలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. బుధవారం పామిడికి విచ్చేసిన ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలపై సమీక్షించారు. అనంతరం రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పుపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

- రైల్వే స్టేషన్‌లో పెరిగిన సెల్‌ఫోన్ చోరీలు
- ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని పోలీసుల సూచన



తాడిపత్రి రైల్వే స్టేషన్



తాడిపత్రి రూరల్: తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో దొంగల భయం అధికమవుతోంది. రాత్రి అయితే చాలు సెల్‌ఫోన్ దొంగలు ప్రత్యక్షమవుతున్నారు. దొంగలు కాపు కాచి ఏమరుపాటుగా ఉన్న ప్రయాణికుల నుంచి విలువైన సెల్‌ఫోన్లు తస్కరిస్తున్నారు. సెల్‌ఫోన్ చోరీకి గురైందని గమనించేలోపు దొంగలు పరారవుతున్నారు. వేలాది రూపాయల సెల్‌ఫోన్‌తోపాటు అందులో విలువైన సమాచారం కూడా పోగొట్టుకుంటూ ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. సెల్‌ఫోన్ల దొంగతనంపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. దొంగల నుంచి రికవరీ చేసిన తరువాత ఇస్తామంటూ బాధితుల చిరునామా తీసుకుని పంపిస్తున్నారు.

రాత్రయితే చాలు..

ఈ మధ్యకాలంలో రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగలు అధికమవుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కువగా రైళ్ల రాకపోకలు ఉంటున్నాయి. రాత్రి ఏడు గంటల నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకూ రైళ్లు వస్తూ పోతుంటాయి. హైదరాబాద్, తిరుపతి, చెన్నై, విజయవాడ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ప్రయాణికులు వెళుతుంటారు. రైలు దిగిన తర్వాత అనంతపురం తోపాటు పరిసర మండలాలకు చెందిన ప్రయాణికులు అర్ధరాత్రి వేళ స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సులు, ఆటోల సౌకర్యం లేకపోవడంతో రైల్వేస్టేషన్‌లోనే కాలాయాపన చేస్తూ ఉదయం వెళ్తుంటారు. కొందరు అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేస్తున్నారు. వీరందరూ మొదటి, రెండో ప్లాట్‌ఫారాల్లో వేచి ఉంటున్నారు. మరికొందరు ప్లాట్ ఫారాలపైన నిద్రపోతున్నారు. సెల్‌ఫోన్లకు చార్జింగ్ తక్కువగా ఉన్నవారు వెయిటింగ్ హాల్‌లో చార్జింగ్ పెట్టుకుంటున్నారు. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని దొంగలు సెల్‌ఫోన్లను తస్కరిస్తున్నారు.

సూటూ బూటుతో మోసం

వారిని చూస్తే దొంగలు అనిపించరు. సూట్, బూట్ వేసుకుని దర్జాగా కనిపిస్తుంటారు. కాలేజీ విద్యార్థుల మాదిరి వీపున బ్యాగులు వేసుకుని ఉంటారు. మరికొందరు పెద్దమనిషి తరహాలో అనుమానం రాకుండా జాగ్రత్త పడుతుంటారు. ఇలాంటి వారందరూ విలువైన సెల్‌ఫోన్ ఉన్న వారిని ఎంపిక చేసుకుని మాటలు కలుపుతున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. నమ్మకం కలిగేలా మాటలు కలిపి బుట్టలో వేసుకుంటున్నారు. వారు ఉన్నారన్న భరోసాతో ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు కునుకు తీస్తారు. ఇదే అదనుగా నిద్రలోకి జారుకున్న వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ తస్కరించి అక్కడి నుంచి పరారవుతున్నారు. మెలకువ వచ్చి చూస్తే పక్కన మనిషి ఉండడు.. జేబులో సెల్‌ఫోన్ ఉండదు. లబోదిబోమంటూ పోలీసుల వద్దకు వెళ్లి సెల్‌ఫోన్ దొంగతనం గురించి ఫిర్యాదు చేస్తున్నారు. వెయిటింగ్ హాల్‌లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుంటున్న ప్రయాణికుల పరిస్థితి ఇంచుమించు ఇదే.

దొంగలను గుర్తించలేకపోతున్న రైల్వే పోలీసులు

టిప్‌టాప్‌గా తయారవుతూ ప్రయాణికుల మాదిరిగా కనిపిస్తున్న దొంగలను రైల్వే పోలీసులు పసిగట్టలేకపోతున్నారు. అంతేకాకుండా వారు ఏదో ఒక ఊరుకు టికెట్ తీసుకుంటుంటారు. అనుమానం వచ్చి ఎక్కడికి వెళుతున్నారని పోలీసులు అడిగినా తీసుకున్న టికెట్ చూపిస్తున్నారు. దీంతో సెల్‌ఫోన్ దొంగలను పట్టుకోవడం పోలీసులకు కష్టంగా మారుతోంది. అందుకే సెల్‌ఫోన్ దొంగల గురించి జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వచ్చిన వారి గురించి సమాచారం ఇవ్వాలని పోలీసులు రోజూ అనౌన్స్‌మెంట్ చేయిస్తుంటారు. ప్రయాణికులు జాగ్రత్తగా ఉంటే సెల్‌ఫోన్ దొంగతనాలను అరికట్టడానికి వీలవుతుందని పోలీసులు సూచిస్తున్నారు.

ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ తస్కరణ

స్టేషన్ లోపల సెల్‌ఫోన్ దొంగతనాలు ఎక్కువవుతుంటే.. స్టేషన్ బయట నిలిపి ఉన్న ద్విచక్రవాహనాల్లో కొందరు పెట్రోల్ తస్కరిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో ఉండే ఆటోలకు రాత్రి సమయాల్లో ప్రయాణికులు వెళ్లాలంటే హడలిపోతున్నారు. రాత్రి పూట ఆటోలకు చార్జీలపై నియంత్రణ లేదు. దీంతో ఎంత మొత్తం అంటే అంత వసులు చేస్తున్నారు. ఆటో చార్జీలకు భయపడి కొంతమంది ప్రయాణికులు రైల్వే స్టేషన్ అవరణలో ద్విచక్ర వాహనాలను పెట్టి ఇతర ప్రాంతాలకు రైళ్లల్లో వెళ్తుంటారు. ద్విచక్ర వాహనాల స్టాండ్ ఉన్నా అక్కడ పెడితే డబ్బు చెల్లించాల్సి వస్తుందని బయట పెట్టి వెళ్తున్నారు. ఇలాంటి వాహనాల నుంచి దొంగలు పెట్రోల్ తీస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఓ ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ తీస్తున్న మహిళను పోలీసులు పట్టుకున్నారు. అమెను విచారించగా వాహనాల దొంగతనం బయటపడటమే కాక ఇందులో మరో ఏడుగురు గ్యాంగ్ ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

విద్యా కిట్ల పంపిణీ



కొడవండ్లపల్లిలో విద్యార్థులకు కిట్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

యల్లనూరు: మండలవ్యాప్తంగా 38 పాఠశాలల్లో చదువుతున్న 2,548 మంది విద్యార్థులకు బుధవారం విద్యాకిట్లు పంపిణీ చేసినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ పోటీతో చదువుకోవాలన్నారు. పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. స్టూడెంట్ కిట్‌లో బ్యాగ్, షూస్, సాక్సులు, టెస్ట్ బుక్కులు, నోటు పుస్తకాలు, యూనిఫామ్ ఉంటాయన్నారు. అనంతరం ఆయన పలు పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేట్ పాఠశాలల బంద్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు గురువారం బంద్ ప్రకటించాయి. భారత్‌బంద్‌లో భాగంగా తాడిపత్రిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టే బంద్‌కు పాఠశాలల యాజమాన్యం సహకరించాలని ఏఐఎస్ఎఫ్ తాడిపత్రి జనరల్ సెక్రటరీ నరసింహ కోరారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటా



హాజరైన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి: కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని తాను, పార్టీ, వైఎస్ జగన్ అండగా ఉంటామని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి భరోసా కల్పించారు. పట్టణంలోని కేఎం ఫంక్షన్ హాల్లో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు, ఓటములు సాధారణమన్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ శ్రేణులు రెచ్చిపోతున్నారన్నారు. అకారణంగా ప్రభుత్వ కార్యాలయాలు ధ్వంసం చేయడం, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తున్నారన్నారు. అయితే అందరికీ కాలమే సమాధానం చెబుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. మూడు పార్టీలు ఏకమై కుట్రలు, కుంత్రాలు చేసినా 40 శాతం ఓట్లను సాధించామన్నారు. 2029లో వైఎస్సార్‌సీపీ గెలిచి తీరుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఏ కష్టం మొచ్చినా, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ యాదవ్, జిల్లా నాయకులు సుభాష్ రెడ్డి, మల్లయ్యయాదవ్, రాజ్‌కుమార్ రెడ్డి, రంగస్వామి, మైనుద్దీన్, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలి



వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని బుధవారం సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి తదితరులు వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన వారు రోజూ కూరగాయలు కొనుగోలు చేయడానికి మార్కెట్‌కు వస్తున్నారన్నారు. వ్యాపారులు ఎక్కువ ధరలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తూకాల్లో కూడా మోసం చేస్తున్నారన్నారు. దళారీ వ్యవస్థ వల్ల రైతులు మోసపోతున్నారన్నారు. మిగతా మున్సిపాలిటీల్లోల్లాగా తాడిపత్రిలో కూడా రైతుబజార్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు వెంకటరాముడు, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, రమణ, ఉమాగౌడ్, రత్నమయ్య తదితరులున్నారు.

విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

పుట్లూరు: విద్యార్థులు పోటీతత్వంతో చదివడం వల్ల ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని శనగలగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గ్రీష్మకు రూ.5 వేలు, నందకిషోర్‌రెడ్డికి రూ.3 వేలు, నాగజ్యోత్స్నకు రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్లు ఆదినారాయణరెడ్డి, వీరారెడ్డి, అశ్వర్థరెడ్డి, రమణరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ 'ఉపాధి' వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలను చెల్లించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బుధవారం ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రాజకీయ కారణాలతో ఉపాధి పనులను ఆపి కూలీల పొట్ట కొట్టొద్దన్నారు. దాదాపు 20 వేల మందికి పైగా కూలీలున్న గుంతకల్లు మండలంలో రాజకీయ కారణాలతో కేవలం 300 మందికి మాత్రమే పనులు కల్పిస్తున్నారన్నారు. వెంటనే కూలీలందరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలందరికీ బీమా సౌకర్యం కల్పించాలని, రోజు వారి కూలి రూ.600 ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

పశువులకు టీకాలు

గార్లదిన్నె: పశువులకు వ్యాప్తిచెందే బొబ్బ, చర్మ వ్యాధి నివారణకు ఉచితంగా టీకా వేస్తున్నట్లు పశు వైద్యాధికారి రమేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గార్లదిన్నె, యర్రగుంట్ల పశువైద్య కేంద్రాల్లో పశువులకు టీకాలు వేస్తామన్నారు. మండలంలోని పశు పోషకులు పశువులకు టీకాలు వేయించాలన్నారు.

లీజుకు ఆర్టీసీ స్థలం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న 2.47 ఎకరాల ఖాళీ స్థలం, ఆర్టీసీ గ్యారేజ్ వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని లీజుకు ఇవ్వనున్నట్లు డీఎం రామచంద్ర తెలిపారు. ఆసక్తి ఉన్న వారు www. apsrtc ap వెబ్ సైట్‌లో అప్లికేషన్‌ను ఈనెల 16లోపు డౌన్‌లోడ్ చేసుకుని ఈడీ(కడప) కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు 'ప్రజావేదిక'

శింగనమల: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 2023–24 మధ్య జరిగిన ఉపాధి హామీ పనులపై జరిగిన సోషల్ ఆడిట్‌కు సంబంధించి ఈనెల 4న ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవీ రమణ బుధవారం తెలిపారు. ప్రజావేదిక కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి విజయలక్ష్మి సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 10 వరకూ రిజిస్ట్రేషన్‌కు గడువు ఉందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఐచ్ఛికాలను నమోదు చేసుకోవాలన్నారు. 19న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. 22న కళాశాలలో చేరాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9290500488 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డయేరియా నివారణే లక్ష్యం

గార్లదిన్నె: డయేరియా వ్యాధి నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ గౌతమి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి ఆగస్టు 31 వరకూ గ్రామాల్లో వైద్య సిబ్బంది స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. అలాగే కలుషిత నీరు, ఆహారం, చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెద్దపప్పూరులో మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్‌వలి

పెద్దపప్పూరు: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆరోగ్య పర్యవేక్షకుడు శర్మాస్‌వలి సూచించారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా బుధవారం కేజీబీవీలో ప్రత్యేకాధికారి బయమ్మ ఆధ్వర్యంలో విద్యార్థినులకు డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రై డే ఫ్రై డే పాటించి దోమలను లార్వా దశలోనే నివారించాలన్నారు. రాత్రి పూట దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శరత్‌బాబు, ఆరోగ్య సిబ్బంది నగీన, సుష్మలత, రామాంజనమ్మ పాల్గొన్నారు.



బీకేఎస్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ లింగా నాయక్

బుక్కరాయసముద్రం: విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని మండల విద్యాధికారి లింగా నాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విష జ్వరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులు వాటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల డాక్టర్ స్వాతి లక్ష్మి, సీహెచ్ఓ మోహన్‌రావు, ఈశ్వరమ్మ, ఆనంద్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని పులిప్రొద్దుటూరు సమీపంలో బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపు తప్పి రాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. తాడిపత్రి నుంచి స్వగ్రామం యుగుడూరుకు బైక్‌లో వెళ్తుండగా కిందపడటంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం అతడిని అనంతపురానికి తరలించారు.

మహిళకు గాయాలు..

యల్లనూరు రోడ్డులోని ఎస్టీపీ–2 వద్ద గల బైపాస్‌లో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలయ్యాయి. భర్తతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడటంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఉపాధి కూలీల హాజరు పెంచండి

యల్లనూరు: మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఉపాధి కూలీల హాజరును పెంచాలని ఏపీఓ షబ్బీర్‌బాషా సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూలీల హాజరు, హార్టికల్చర్ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతిఒక్కరూ ఉపాధి ప్రగతి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ , ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్టియన్స్ డే

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో బుధవారం ఇండియన్ క్రిస్టియన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్రిస్టియన్స్ డే ప్రాముఖ్యత గురించి యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీసీ రత్నరాజు వివరించారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కెనాల్ రక్షణ గోడ నిర్మించండి



కెనాల్‌పై కూలిన రక్షణ గోడను చూపుతున్న నాయకులు

గుంతకల్లుటౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు నేలకూలిన జీఎస్‌బీసీ కెనాల్ రక్షణ గోడను నిర్మించాలని పట్టణ పౌరుల సంఘం కన్వీనర్ మారుతి డిమాండ్ చేశారు. రక్షణ గోడను నిర్మించడంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ ఆలూరు రోడ్ సీఐటీయూ కాలనీ కెనాల్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలూరు రోడ్డు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయన్నారు. అంతేకాకుండా ఐదారు కాలనీలు, స్కూళ్లు, కాలేజీలు ఉన్నాయని, ఎలాంటి ప్రమాదాలు జరగకముందే రక్షణ గోడ నిర్మించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పౌర సంఘం నాయకులు చంద్రశేఖర్, ఓబులేసు, మోహన్, అబ్దుల్లా, రాము తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన



చిన్నారికి అన్న ప్రాసన చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఈద్గా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సీడీపీఓ ఢిల్లీశ్వరి ఆధ్వర్యంలో అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్న ప్రాసన చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రం ప్రీ స్కూల్‌లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.